సాక్షి
సిద్దిపేట
శనివారం ౹ 27 ౹ సెప్టెంబర్ ౹ 2025



సిద్దిపేట పట్టణంలోని విశాలాక్షి ఆలయంలో అమ్మవారికి కరెన్సీ నోట్లతో అలంకరణ, పూజలు



గజ్వేల్: ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న మహాకాళి అమ్మవారు



శ్రీమహాలక్ష్మిదేవిగా వర్గల్ అమ్మవారు

ఐశ్వర్య ప్రదాయిని నమోస్తుతే..

నేత్రపర్వంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/వర్గల్(గజ్వేల్): దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు జిల్లాలో అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల అయిదోరోజు శుక్రవారం అమ్మవారు ఐశ్వర్య ప్రదాయిని మహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. ఆలయాలలో, అమ్మవారి మండపాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని విశాలాక్షి అమ్మవారి ఆలయంలో నెలకొల్పిన దేవి మండపాన్ని నిర్వాహకులు రూ.10లక్షల కరెన్సీ నోట్లతో అందంగా అలంకరించారు. అనంతరం కుంకుమార్చన, పుష్పార్చన చేశారు. అలాగే జిల్లా కేంద్రంలోని కన్యాకాపరమేశ్వరి అమ్మవారు శాకాంబరిగా, రేణుకా ఎల్లమ్మ, అష్టలక్ష్మి సహిత లలితా పరమేశ్వరి అమ్మవార్లను మహాలక్ష్మీదేవిగా అలంకరించారు. చదువుల తల్లి సన్నిధి వర్గల్ విద్యాధరి మాత మహాలక్ష్మీదేవిగా దివ్య దర్శనమిచ్చారు.

న్యూస్‌రీల్

జిల్లా ప్రధాన న్యాయమూర్తి పూజలు



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ప్రధాన న్యాయమూర్తి సాయిరమాదేవి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని అష్టలక్ష్మి సహిత లలితా పరమేశ్వరి ఆలయంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి శుక్రవారం పూజలు నిర్వహించారు. అంతకు ముందు ఆలయ నిర్వాహకులు, అర్చకులు జిల్లా ప్రధాన న్యాయమూర్తికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పూజల అనంతరం అమ్మవారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందించి, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, అర్చకులు పాల్గొన్నారు.

స్వచ్ఛతలో భాగస్వాములు కావాలి

మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్



కోమటి చెరువు వద్ద పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్

సిద్దిపేటజోన్: స్వచ్ఛతలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ పిలుపునిచ్చారు. శుక్రవారం విపంచి ఆడిటోరియంలో వీధి వ్యాపారులకు లోక్ కల్యాణ మేళాలో భాగంగా శుభ్రత, ఆహార భద్రత అంశాలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీధి విక్రయ వ్యాపారులు శుభ్రత పాటించాలని సూచించారు. ప్లాస్టిక్ కవర్లు, ప్లేట్స్ స్థానంలో మోదుగు ఆకులు, జ్యూట్ బ్యాగులు వాడాలన్నారు. ప్లాస్టిక్‌తో క్యాన్సర్ ప్రమాదం పొంచి ఉందన్నారు. ప్లాస్టిక్ రహిత పట్టణంగా మార్చుదామన్నారు. స్టీల్ బ్యాంక్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం కోమటిచెరువు వద్ద బతుకమ్మ ఏర్పాట్లు పరిశీలించారు.

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ కళాశాలలు

డీఐఈఓ రవీందర్‌రెడ్డి



మాట్లాడుతున్న డీఐఈఓ రవీందర్‌రెడ్డి

దుబ్బాక: ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలను బలోపేతం చేస్తున్నామని డీఐఈఓ రవీందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం దుబ్బాక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పేరెంట్స్– టీచర్స్ మీటింగ్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు అనుభవజ్ఞులైన అధ్యాపకులతో బోధన జరుగుతుందన్నారు. బలోపేతానికి ప్రభుత్వం కళాశాలలకు నిధులు మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, అధ్యాపకులు విజయేందర్‌రెడ్డి, శివకుమార్, తిరుపతిరెడ్డి, రవిందర్‌రెడ్డి, రాజు, వీరయ్య, స్వర్ణకుమారి, సంతోష, శైలజ, స్వప్న తదితరులు ఉన్నారు.

న్యాయవాదుల నిరసన



హుస్నాబాద్ కోర్టు ఎదుట నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

హుస్నాబాద్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ శుక్రవారం హుస్నాబాద్ కోర్టు ఎదుట న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనుచిత వ్యాఖ్యలు చేసిన న్యాయవాదులకు బార్ లైసెన్స్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ న్యాయవాదులు రమేశ్, సురేష్, రవీందర్, శ్రీనివాస్, శ్రీదేవి, శ్రీనివాస్ నాయక్, రాజశేఖర్, కిరణ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో కొన్ని రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో 13 మంది పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి రూ.11,200 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

స్థానికం.. వేగిరం



- ఎన్నికల నిర్వహణకు కసరత్తు ముమ్మరం
- ఇప్పటికే రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి
- రెండు రోజుల్లో ప్రకటించే అవకాశం
- 3వేల పీఓలకు శిక్షణ
- త్వరలో జోనల్ అధికారుల నియామకం

స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు వేగంగా కసరత్తు జరుగుతోంది. ఏడాదిన్నరగా గ్రామ పంచాయతీలు, ఏడాదిగా జిల్లా పరిషత్, మండల పరిషత్‌లు ప్రత్యేక పాలనలో కొనసాగుతున్నాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు చర్యలు ముమ్మరం చేసింది. ఇటీవల వార్డుమెంబర్, సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీ, జెడ్పీటీసీల రిజర్వేషన్‌ల ప్రక్రియ పూర్తి కాగా ఇదివరకే ఓటరు తుది జాబితా ప్రకటించారు. ఎన్నికల నిర్వహణకు అధికారులకు రెండో విడత శిక్షణ సైతం శుక్రవారం నిర్వహించారు. ఇక బీసీ రిజర్వేషన్ల ఖారారుతో గెజిట్, నోటిఫికేషన్ రావడమే మిగిలి ఉంది.

– సాక్షి, సిద్దిపేట

జిల్లాలో 508 గ్రామ పంచాయతీలు, 4,508 వార్డులు, ఎంపీటీసీ స్థానాలు 230, జెడ్పీటీసీ స్థానాలు 26 ఉన్నాయి. ఇప్పటికే బ్యాలెట్ పేపర్లు, బాక్స్‌లు సిద్ధం చేశారు. బ్యాలెట్ బాక్స్‌లు మన జిల్లాలో అందుబాటులో ఉన్నవి సరిపోవని అదనంగా కర్ణాటక నుంచి తెప్పించారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ కోసం 7,853 అధికారులను జిల్లా యంత్రాంగం నియమించింది. వీరికి 19 మంది మాస్టర్ ట్రెనర్‌ల ద్వారా 19 చోట్ల శిక్షణ ఇచ్చారు. అందులో 3,130 మంది ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. 3,919 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు త్వరలో శిక్షణ ఇవ్వనున్నారు. ఆర్వోలు స్టేజ్–1కు 194, స్టేజ్–2 కు 610 మందిని నియమించారు. దసరా సెలవులు కావడంతో టూర్‌లు, బంధువుల ఇంటికి వెళ్లిన ఉపాధ్యాయులు శిక్షణకు సంబంధించిన ఆర్డర్లు తీసుకునేందుకు మొదట వెనుకడుగు వేశారు. విద్యాశాఖ నుంచి కచ్చితమైన ఆదేశాలు జారీ చేయడంతో ఆర్డర్లు తీసుకుని శిక్షణకు హాజరయ్యారు.

రెవెన్యూ డివిజన్	పీఓ	ఓపీఓలు
సిద్దిపేట	1,735	1,966
హుస్నాబాద్	631	673
గజ్వేల్	764	1,280

త్వరలో జోనల్ ఆఫీసర్ల నియామకం

ప్రతి మండలానికి మూడు నుంచి నాలుగు జోనల్ ఆఫీసర్లను నియమించనున్నారు. అలాగే ప్రతి మండలానికి ఒక ఫ్లైయింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేసి ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇంకా అవసరమైతే మరిన్ని టీంలను ఏర్పాటు చేయనున్నారు.

రెండు రోజుల్లో షెడ్యూల్?

వార్డులకు గ్రామం యూనిట్‌గా, ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలకు మండలం యూనిట్‌గా.. జెడ్పీటీసీకి జిల్లా యూనిట్‌గా రిజర్వేషన్లు ఫైనల్ చేశారు. ఈ జాబితాను బయటకు వెల్లడించవద్దని ప్రభుత్వం ఆదేశించింది. మరో రెండు రోజుల్లో అధికారికంగా రిజర్వేషన్లకు సంబంధించి గెజిట్‌ను ప్రభుత్వం విడుదల చేయనున్నట్లు విశ్వసనీయ సమాచారం. రిజర్వేషన్ల గురించి ఆశావహులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. రిజర్వేషన్ల ప్రకటన తర్వాత ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించే అవకాశం ఉందని తెలుస్తోంది.

అధికారులు సిద్ధంగా ఉండాలి

హుస్నాబాద్‌రూరల్: ప్రభుత్వం ఎన్నికలను ఎప్పుడు నిర్వహించినా అధికారులు సిద్ధంగా ఉండాలని జెడ్పీ సీఈఓ రమేశ్ సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎన్నికల పోలింగ్ అధికారులకు శిక్షణ తరగతులను నిర్వహించగా సీఈఓ పరిశీలించారు. గ్రామాల్లో రాజకీయ పార్టీలకు అతీతంగా ఎన్నికలు నిర్వహించాన్నారు. ఓటర్లను స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోనేందుకు సహకరించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పీఓల శిక్షణను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ రమేశ్

ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ

మిరుదొడ్డి(దుబ్బాక): మండల కేంద్రంలో ఎన్నికల శిక్షణాధికారులు శుక్రవారం ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీల ఎన్నికల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఎన్నికల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను, నిర్వహించాల్సిన విధులపై వివరించారు. ఓటర్లు ఓటును సద్వినియోగం చేసుకునేలా ప్రతి ఒక్కరూ సమన్వయంతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గంగుల గణేశ్‌రెడ్డి, ఎంఈఓ ప్రవీణ్ రెడ్డి, ఇన్‌ఛార్జి ఎంపీఓ ఫహీం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఎన్నికల విధులను వివరిస్తున్న ఎన్నికల శిక్షణాధికారులు

భూమి, భుక్తి కోసం పోరాడిన ధీరవనిత

- కలెక్టర్ హైమావతి
- చాకలి ఐలమ్మకు ఘన నివాళి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/సిద్దిపేటకమాన్: భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడిన ధీర వనిత చాకలి ఐలమ్మ అని కలెక్టర్ హైమావతి అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట వీరురాలు చాకలి ఐలమ్మ జయంతిని శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజల పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన నిప్పుకణిక చాకలి ఐలమ్మ అన్నారు. కార్యక్రమంలో జిల్లా బీసీ అభివృద్ధి అధికారి సయ్యద్ రఫీక్, ఇతర జిల్లా అధికారులు ఉన్నారు. అలాగే సిద్దిపేట పట్టణంలోని ఐలమ్మ కాంస్య విగ్రహానికి కలెక్టర్ హైమావతి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల తదితరులు పాల్గొన్నారు.



ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్

మొదటి రోజు నిల్..

- వచ్చే నెల 18 వరకు దరఖాస్తులు
- 93 మద్యం దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం
- ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసమూర్తి

సిద్దిపేటకమాన్: జిల్లాలోని మద్యం దుకాణాల నిర్వహణకు (2025–27) సిద్దిపేట ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, మొదటి రోజు ఒక్క దరఖాస్తు కూడా రాలేదని ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసమూర్తి, ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలోని 93 మద్యం దుకాణాలకు వచ్చేనెల 18వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. స్టేషన్‌లో తొమ్మిది కౌంటర్లను ఏర్పాటు చేశామని, రూ.3లక్షల డీడీతో కార్యాలయ పనివేళలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఒక్క దరఖాస్తుదారుడు ఎన్ని షాపులకైనా ఎన్ని దరఖాస్తులైనా చేసుకోవచ్చని తెలిపారు. దసరా పండగ తర్వాత దరఖాస్తులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉండనున్నట్లు తెలిపారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

కలెక్టరేట్‌లో మాజీ సీఎస్ శాంతికుమారిని కలిసి విన్నపం

సిద్దిపేటరూరల్: జిల్లాలోని అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ మాజీ సీఎస్ శాంతికుమారికి వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వ మాజీ సీఎస్, మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ వైస్ చైర్‌పర్సన్ శాంతికుమారి శుక్రవారం కలెక్టరేట్ కు రావడంతో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆమెను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను వివరించారు. ఉద్యోగుల పెండింగ్ జీతాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర జేఏసీ ఉపాధ్యక్షుడు యాదగిరి, రాష్ట్ర జేఏసీ చైర్మన్ రాజిరెడ్డి, సిద్దిపేట డివిజన్ అధ్యక్షుడు నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.



మాజీ సీఎస్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

కొండపోచమ్మ సందర్శన నిలిపివేత



కొండపోచమ్మ సాగర్ వద్ద హెచ్చరిక ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తున్న ఏసీపీ

మర్కూక్(గజ్వేల్): కొండపోచమ్మ సాగర్ సందర్శనను నిలిపివేసినట్లు గజ్వేల్ ఏసీపీ నర్సింహులు తెలిపారు. అధికారుల సూచనల మేరకు కొండపోచమ్మ సాగర్‌ను శుక్రవారం ఎస్ఐ విజయ్ కుమార్‌తో కలిసి సందర్శించి, ఈ మేరకు హెచ్చరిక ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజల భద్రత కోసం సాగర్ సందర్శనను నిలిపివేస్తున్నామన్నారు. ప్రజలు నీటిలోకి ప్రవేశించకూడదని, చేపల వేటకు వెళ్లకూడదని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. .

మల్లన్న సాగర్‌లో చేపలు పట్టడం నిషేధం

తొగుట(దుబ్బాక): మల్లన్న సాగర్ రిజర్వాయర్‌లోకి దిగేందుకు అనుమతిలేదని, చేపలు పట్టడం నిషేధమని ఏసీపీ నర్సింహులు తెలిపారు. మల్లన్న సాగర్ వద్ద శుక్రవారం హెచ్చరికలతో కూడిన ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు ఈత కోసం ప్రాజెక్టులోకి దిగవద్దని నీటిలో మొసళ్లు తిరుగుతున్నాయని చెప్పారు. ప్రజల రక్షణ కోసం తీసుకుంటున్న చర్యలను అందరూ పాటించి పోలీసులకు సహకరించాలన్నారు.

పండుగకు ప్రత్యేక బస్సులు

ప్రయాణికుల రద్దీ పెరిగితే బస్సుల సంఖ్య పెంపు



నారాయణఖేడ్: బతుకమ్మ, దసరా పండుగ దృష్ట్యా ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతోంది. ఈనెల 27 నుంచి అక్టోబర్ 1వ తేదీ వరకు ఆయా ప్రాంతాల నుంచి తమ తమ స్వగ్రామాలకు వచ్చే ప్రయాణికుల కోసం, దసరా అనంతరం తిరుగు ప్రయాణం అయ్యే ప్రయాణికులకోసం అక్టోబర్ 3 నుంచి 6వ తేదీ వరకు ఈ బస్సు సర్వీసులు నడపనున్నారు. ఉమ్మడి జిల్లాలోని మెదక్ రీజియన్ పరిధిలో ఆర్టీసీ అధికారులు ఎనిమిది డిపోల నుంచి 132 సర్వీసులు నడిపేందుకు సిద్ధమయ్యారు. గతంలో పండగల సీజన్‌లో ప్రత్యేక బస్సులను నడిపిన ఆర్టీసీ మంచి ఆదాయాన్ని సముపార్జించింది. ఈసారి కూడా ప్రత్యేక బస్సు సర్వీసులను నడిపి ఆదాయం సమకూర్చుకోవాలని భావిస్తున్నారు. రీజియన్ పరిధిలో ఈనెల 27న 40 బస్సులు, 28న 41, 29న 35,30న 24, 1న 17, 2న 15 సర్వీసులను నడపనున్నారు.

ప్రత్యేక బస్సులు ఇలా..

హైదరాబాద్ నుంచి..నారాయణఖేడ్ డిపోకు సంబంధించి జేబీఎస్, సికింద్రాబాద్, లింగంపల్లి, పటాన్‌చెరు, జహీరాబాద్ డిపో..జేబీఎస్, లింగంపల్లి, సంగారెడ్డి క్రాస్‌రోడ్, సంగారెడ్డి డిపో జేబీఎస్, సికింద్రాబాద్, గజ్వేల్ – ప్రజ్ఞాపూర్ డిపో...సికింద్రాబాద్, మెదక్ డిపో..సికింద్రాబాద్, బాలానగర్ వయా నర్సాపూర్, సిద్దిపేట డిపో.. జేబీఎస్, కరీంనగర్, వేములవాడ, దుబ్బాక డిపో..సికింద్రాబాద్, నర్సాపూర్ డిపో.. జేబీఎస్, బాలానగర్ నుంచి ప్రత్యేక సర్వీసులు నడపనున్నారు.

50% అదనపు చార్జీలు..

ఈ ఆర్టీసీ ప్రత్యేక బస్సుల్లో జీవో నం 16 ప్రకారం 50% అదనపు చార్జీలను వసూలు చేయనున్నారు. ప్రత్యేక బస్సుల్లో తిరుగు ప్రయాణంగా ఖాళీగా వచ్చే బస్సులకు అయ్యే కనీస డీజిల్ ఖర్చులను దృష్టిలో ఉంచుకుని ఈ అదనపు చార్జీలను ఆర్టీసీ వసూలు చేయనుంది. ఈ నిర్ధారిత ప్రత్యేక బస్సులకు తోడు ప్రయాణికుల రద్దీ పెరిగిన పక్షంలో అప్పటికప్పుడు మరికొన్ని బస్సు సర్వీసులను నడిపేందుకు ఆర్టీసీ సిద్ధమైంది.

ప్రయాణికులకు బహుమతులు

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారికి లక్కీ డ్రా నిర్వహించి బహుమతులు అందజేసేందుకు ఆర్టీసీ నిర్ణయించింది. రీజియన్‌కు ముగ్గురు చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 33మందికి రూ.5.50లక్షల విలువ గల బహుమతులను సంస్థ అందజేయనుంది.

వరద ఉధృతం.. రాకపోకలు కష్టతరం

అక్కన్నపేట(హుస్నాబాద్): రెండ్రోజులుగా ఎడతేరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి అక్కన్నపేట మండలం మల్లంపల్లి– గొల్లపల్లికి వెళ్లే రోడ్డుపై వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ఇరువైపులా వెళ్లే వాహనదారులకు ఇబ్బందులు తప్పడంలేదు. దాదాపు మోకాలి లోతుతో నీరు వేగంగా ప్రవహిస్తుండటంతో ద్విచక్రవాహనదారులు రోడ్డు దాటడానికి సాహసం చేయాల్సివస్తోంది. వర్షాలు పడితే చాలు వాగులు, వంకలు పొంగి ఇలా రోడ్డుపై రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని వాహనదారులు చెబుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే బ్రిడ్జి నిర్మించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు.



మల్లంపల్లి- గొల్లపల్లికి వెళ్లే మార్గంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వరదలోనే కొనసాగుతున్న రాకపోకలు

సొంతూర్లకు వెళ్తే సమాచారం ఇవ్వండి

గజ్వేల్‌రూరల్: పండుగల నేపథ్యంలో సొంతూర్లకు వెళ్లే ప్రజలు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని గజ్వేల్ సీఐ రవికుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ బతుకమ్మ, దసరా పండుగల సెలవులు రావడంతో ప్రజలు సొంతూరి బాట పడుతుంటారని, ఇలాంటి సమయంలోనే చోరీలు జరిగే ఆస్కారముందన్నారు. ప్రజలు తగు జాగ్రత్త చర్యలు పాటించడంతో పాటు పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ప్రజలు తమ సొంతూర్లకు వెళ్లే సమయంలో ఇళ్లలో బంగారు ఆభరణాలు, నగదును ఉంచకూడదని, వాటిని బ్యాంకు లాకర్లలో భద్రపర్చుకోవాలన్నారు. అదే విధంగా ప్రతి ఇంటికి సెక్యూరిటీ అలారం, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. పండుగకు వెళ్లి తిరిగి వచ్చే వరకు ఇరుగుపొరుగు వారిని తమ ఇంటి వివరాలు అడిగి తెలుసుకోవాలని, ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు.

క్లుప్తంగా

తప్పిపోయిన బాలిక తల్లిదండ్రుల చెంతకు



బాలికను తల్లి స్రవంతికి అప్పగిస్తున్న ఏఎస్ఐ సదాత్‌మియా

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి బస్టాండ్ ఆవరణలో శుక్రవారం మధ్యాహ్నం 5 ఏళ్ల లోపు ఓ చిన్నారి ఏడుస్తూ కనిపించింది. చుట్టుపక్కల ఎవరూ లేకపోవడంతో తప్పిపోయిందని గుర్తించి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో చిన్నారిని పోలీస్‌స్టేషన్ తీసుకెళ్లి గంటన్నర వ్యవధిలోనే ఆచూకీని కనిపెట్టారు. చిన్నారి వెల్దుర్తి పట్టణంలోని కోటకింది కాలనీకి చెందిన ఉప్పల చైత్రికగా నిర్ధారించి తల్లి స్రవంతికి అప్పగించారు. బాలిక ఆచూకీని కనుగొని తల్లిదండ్రులకు అప్పగించడంపై పోలీసులను పలువురు అభినందించారు.

'కురుమ సంఘానికి' స్థలం కేటాయింపు



కురుమ సంఘం నేతలకు భూమి పత్రాలను అందజేస్తున్న తహసీల్దార్

మెదక్ జోన్ : కురుమ సంఘం భవన నిర్మాణం కోసం పట్టణ పరిధిలోని పిల్లికొటాల్ శివారులో డబుల్‌బెడ్రూంల ప్రాంతంలో ఎకరం ప్రభుత్వ భూమిని తహసీల్దార్ అధికారికంగా కేటాయించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నేతలకు శుక్రవారం భూమి పత్రాలు అందజేశారు. అనంతరం కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు కోరె ఎల్లయ్య మాట్లాడుతూ.. తమ సంఘం కోసం గతంలో రెవెన్యూ అధికారులు పట్టణంలోని కాకతీయ స్కూల్ వద్ద ఎకరం భూమి కేటాయించారన్నారు. కాగా ప్రస్తుతం అక్కడ సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం దానిని ప్రభుత్వం తిరిగి తీసుకుందన్నారు. తమ భవనం కోసం పిల్లికొటాల్ వద్ద ఎకరం భూమిని కేటాయించడం సంతోషంగా ఉందన్నారు.

ఎన్నికల నిర్వహణకు శిక్షణ


కొండపాక(గజ్వేల్): కొండపాకలోని ఐటీసీ భవనంలో ఎన్నికల నిర్వహణ సిబ్బందికి నిర్వహించిన శిక్షణ తరగతులను శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ విషయంలో అలసత్వం చూపకూడదన్నారు. అనంతరం పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల నిర్వహణ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల శిక్షణపై ఆరా

- జెడ్పీ సీఈఓ రమేశ్

బెజ్జంకి(సిద్దిపేట): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలని జెడ్పీ సీఈఓ రమేశ్ అధికారులకు సూచించారు. బెజ్జంకి రైతు వేదికలో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా, ప్రశాంతంగా జరిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రవీణ్, ప్రిసైడింగ్ అధికారులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

నిధులు దుర్వినియోగమైతే చర్యలే?



మాట్లాడుతున్న ఏపీడీ రంగాచార్యులు

హవేళిఘణాపూర్(మెదక్): ప్రభుత్వం చేపట్టే పనుల్లో ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది చేయని పనులకు బిల్లులు చెల్లిస్తే డబ్బులు చర్యలు తీసుకుంటామని డీఆర్‌డీఏ ఏపీడీ రంగాచార్యులు అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సామాజిక తనిఖీ కార్యక్రమానికి హాజరై పనుల వివరాలు తెలుసుకున్నారు. మెదక్ మండలంలో నిర్వహించిన 222 పనులకు గాను కూలీల ఖర్చు రూ.3.88కోట్లు, సామగ్రి కొనుగోలు ఖర్చు రూ.26.39 లక్షలు ఖర్చు చేసినట్లు తెలిపారు. పంచాయతీరాజ్ పథకం కింద కూలీల ఖర్చు రూ.11,672, సామగ్రి ఖర్చు రూ.1.80 కోట్లు ఖర్చు చేయగా ఇందులో రూ.4,358 రికవరీ, రూ.2వేల పెనాల్టీ వేయనున్నట్లు తెలిపారు. డీవీవో శ్రీహరి, రాజేందర్, ఎంపీడీవో ప్రవీణ్, అంజాగౌడ్,ఏపీవో వేణుగోపాల్‌రెడ్డి, నర్సయ్య , సెక్రటరీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పండుగకు చుక్క, ముక్క లేనట్లే.!



గాంధీ జయంతి నాడే దసరా

- మద్యం, మాంసం విక్రయాలకు అనుమతి లేదు
- ప్రభుత్వ ఖాజానాపై తీవ్ర ప్రభావం
- ఉమ్మడి జిల్లాలో రోజు రూ.10 కోట్ల వరకు మద్యం అమ్మకాలు

దసరా పండుగంటే అందరికి సంబరమే. అయితే ఈ సంవత్సరం అక్టోబర్ 2వ తేదీన వస్తుంది. దీంతో మద్యం, మాంసాహార ప్రియులు ఆలోచనలో పడ్డారు. తెలంగాణలో వివిధ శుభకార్యాలు, పండుగలు, ఫంక్షన్లు ఏదైనా.. మాంసం, మద్యం లేనిదే కిక్కు ఉండదు. ముఖ్యంగా రాష్ట్రంలో ఇది ఓ ఆనవాయితీగా వస్తోంది. ఇక దసరా అంటేనే ఏ పండుగకి లేనంత జోష్ ఉంటుంది. ఇదే రోజు చుక్క, ముక్క ఉండాల్సిందే. మద్యంతో పాటు మటన్, చికెన్ కావాల్సిందే.

జోగిపేట(అందోల్):

అక్టోబర్ 2న గాంధీ జయంతి, అదే రోజు దసరా పండుగ కూడా వస్తోంది. ఈ నేపథ్యంలో మద్యం, మాంసం విక్రయాలపై ఆసక్తికర చర్చ నడుస్తోంది. సాధారణంగా గాంధీ జయంతి రోజు మద్యం, మాంసం దుకాణాలు మూసి వేయడం ఆనవాయితీ. అయితే అన్ని పండుగల మాదిరిగా దసరా ఉండదు. ఆ రోజున చాలామందికి చుక్క లేనిదే ముద్ద దిగదు. అందుకోసం పండుగ రోజు ఎట్లా అని మద్యం, మాంసం విక్రయాలపై తర్జన భర్జన పడుతున్నారు.



మాంసం దుకాణం

విక్రయాలపై సందిగ్ధం..

దసరాకి మాంసాహారులైన ప్రతి ఇంట్లో ముక్క ఉండాల్సిందే. పండుగ వేళ గొర్రె పొట్టేళ్ల, మేక పోతుల మంసానికి డిమాండ్ ఉంటుంది. నాటు, పారం కోళ్ల, చేపలకు కూడా మస్తు గిరాకీ ఉంటుంది.

ప్రతి రోజు కోట్లలో..



ఉమ్మడి జిల్లాలో ప్రతిరోజు రూ.10 కోట్ల వరకు, నెలకు సుమారుగా రూ.275 కోట్ల వరకు లిక్కర్ అమ్మకాలు జరుగుతాయి. అయితే ఒక్క దసరా రోజే ప్రతి యేట సుమారు రూ.20 కోట్లకు పైగా అమ్మకాలు జరిగి భారీగా ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతోంది. అయితే ఈ సారి దసరా, గాంధీ జయంతి ఒకే రోజు రావడం, మద్యం దుకాణాలను మూసివేస్తున్నట్లు ఎక్సైజ్ అధికారులు ప్రకటించారు. దీంతో మద్యం అమ్మకాలపై, రాష్ట్ర ఖజానాపై ప్రభావం పడే అవకాశం లేకపోలేదు.

మటన్‌షాపులకు అనుమతివ్వండి

ప్రతి సంవత్సరం దసరా రోజు మటన్, చికెన్ షాపుల్లో గిరాకీ 'ఉంటుంది. పండుగ రోజు విక్రయాలు జరగకపోతే ఆర్థికంగా నష్టపోతాం. అధికారులు స్పందించి అనుమతులివ్వాలి. పండుగ రోజు వందలాది మంది మార్కెట్‌కు మాంసం కోసం వస్తుంటారు.

– శేఖర్, మాంసం వ్యాపారి

మద్యం విక్రయాలు జరగవు

దసరా, గాంధీ జయంతి ఒకేసారి రావడంతో వైన్స్, బార్ షాపులు ప్రభుత్వ ఆదేశాల మేరకు బంద్ ఉంటాయి. బెల్ట్ షాపుల నిర్వాహకులు విక్రయాలు జరిపితే చర్యలు తీసుకుంటాం. ఎక్సైజ్ సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి మద్యం అమ్మకాలు జరగకుండా చూడాలి.

– హరికిషన్, ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్

దేశ అభివృద్ధికి ప్రధాని కృషి

ఎంపీ రఘునందన్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ

నర్సాపూర్: దేశాన్ని అన్ని రంగాల్లో ప్రపంచంలో మొదటి స్థానంలో నిలిపేందుకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నిరంతరం కృషి చేస్తున్నారని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. శుక్రవారం నర్సాపూర్‌లో బీజేపీ కార్యాలయం ప్రారంభించిన అనంతరం కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీకి దేశం, పార్లమెంటు, చట్టాలు అంటే ఏం తెలియవని విమర్శించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అందరూ సమష్టిగా పని చేస్తే అన్ని స్థానాల్లో గెలుస్తామన్నారు. నాయకులు ప్రజల సమస్యల పరిష్కారం కోసం శ్రమిస్తూ జనం గుండెల్లో స్థానం సంపాదించుకోవాలని హితవు పలికారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల్ల అటవీ ప్రాంతం నుంచి నర్సాపూర్ పట్టణ శివారు వరకు ఉన్న అడవిలో ఎలివేటెడ్ కారిడార్ ఏర్పాటు చేయించేందుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు. అనంతరం చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని ఆమె చిత్ర పటానికి ఎంపీ పార్టీ నాయకులతో కలిసి పూల మాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి సురేశ్ , జిల్లా అధ్యక్షుడు మల్లేశ్ గౌడ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్న రమేశ్ గౌడ్, పార్టీ నాయకులు పెద్ద రమేశ్ గౌడ్, నగేశ్, బుచ్చేశ్ యాదవ్, కవిత, ఆంజనేయులుగౌడ్, చంద్రయ్య, రమేశ్ యాదవ్, బాల్‌రాజ్, నారాయణరెడ్డి, యాదగిరి, దేవేందర్ యాదవ్, ప్రేం, ఆయా మండల శాఖల అధ్యక్షులు పాల్గొన్నారు.

చెరువును తలపిస్తున్న 'రైల్వే బ్రిడ్జి'



మిర్జాపల్లి రైల్వే అండర్ గ్రాండ్ బ్రిడ్జిలో చేరిన నీరు

- మిర్జాపల్లికి రాకపోకలు బంద్
- పట్టాలు దాటుతున్న ప్రజలు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని మిర్జాపల్లి రైల్వే అండర్ గ్రౌండ్ బ్రిడ్జి చెరువును తలపిస్తుంది. గ్రామంలోని ఫించెరువు భారీ వర్షాలతో నిండి అలుగు పారుతుండటంతో బ్యాక్‌వాటర్ రైల్వే బ్రిడ్జిలోకి చేరింది. దీంతో గ్రామానికి ఉన్న ఏకైక రహదారి మూసుకుపోవడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామస్తులు నార్సింగి, శేరిపల్లి, రైల్వేస్టేషన్‌కు రావాలన్న, ఇతర గ్రామాల ప్రజలు మిర్జాపల్లికి వెళ్లాలన్న దారి మూసుకుపోవడంతో నడకదారిన పట్టాలు దాటడం తప్ప మరో మార్గం లేదు. మరో వైపు కొందరు ద్విచక్రవాహనాలను కూడా పట్టాలను దాటించేందుకు ప్రయాసపడుతున్నారు. మిర్జాపల్లి రైల్వే స్టేషన్ రెండవ ప్లాట్‌ఫారం వెనక నుంచి గ్రామస్తులు శంకరంపేట రోడ్డుకు వెళ్లేందుకు తాత్కాలిక దారి ఉన్నప్పటికీ ఈ మధ్యనే రైతులు దారిని మూసివేయడంతో సమస్య జటిలమైంది. దీంతో గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి దారి సమస్యను పరిష్కరించి రాకపోకలు సాగించేలా సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

భూ కబ్జాదారుల అరెస్టు



వివరాలు తెలుపుతున్న సీఐ ఉపేందర్

సిద్దిపేటకమాన్: భూ కబ్జాకు పాల్పడిన భార్యాభర్తలను సిద్దిపేట టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. టూటౌన్ సీఐ ఉపేందర్ వివరాల ప్రకారం... పట్టణంలోని సర్వే నం.1269లో ఓ ప్లాట్‌ను మూడేళ్ల క్రితం చకిలం వెంకటలక్ష్మి హన్మంతచారి నుంచి కొనుగోలు చేశారు. వెంకటలక్ష్మి కుటుంబంతో పాటు హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో పట్టణానికి చెందిన భార్యాభర్తలు రాజమణి, రాజయ్య ప్లాట్‌ను కబ్జా చేసి, హద్దులు మార్చి రేకుల షెడ్ వేసి ఫేక్ ఇంటి నంబర్‌తో తన భార్య పేరుపై గిఫ్ట్ డీడ్ చేయించాడు. విషయం తెలుసుకుని ప్లాట్ యజమాని భార్యాభర్తలను అడగగా వారు ప్లాట్ యాజమానిని బెదిరించారు. ప్లాట్ అన్యాక్రాంతం కాకూడదని బాధితులు కృష్ణుడి గుడి కోసం హరే తత్సంగం వారికి రిజిస్ట్రేషన్ చేశారు. దీంతో వారు నెల రోజుల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన ఎస్ఐ ఆసీఫ్ దర్యాప్తు చేపట్టారు. పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి ప్లాట్‌ను కబ్జా చేసిన భార్యాభర్తలు ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

చిన్నారిపై వీధి కుక్కల దాడి



గాయాల పాలైన చిన్నారి స్వాతి

ఝరాసంగం(జహీరాబాద్): చిన్నారిపై వీధి కుక్కలు దాడి చేసి గాయపర్చాయి. ఈ ఘటన మండలంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, స్థానికుల కథనం ప్రకారం... మండల పరిధిలోని బర్దిపూర్ గ్రామానికి చెందిన కోట ప్రకాశ్ కూతురు స్వాతి(4)తోటి స్నేహితులతో కలిసి ఆడుకుంటుంది. అటువైపుగా వచ్చిన వీధి కుక్కలు ఒక్కసారిగా చిన్నారిపై దాడి చేశాయి. గమనించిన స్థానికులు కుక్కలను వెంబడించి చిన్నారిని దాడి నుండి కాపాడారు. అప్పటికే ఆమెకు పలుచోట్ల గాయాలయ్యాయి. వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ వెళ్లాలని సూచించారు.

అనారోగ్యంతో పురుగుల మందు తాగి..



వగ్గు సిద్ధరాంలు

రామాయంపేట(మెదక్): పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ చనిపోయాడు. వివరాలు ఇలా... మండలంలోని అక్కన్నపేటకు చెందిన వగ్గు సిద్ధరాంలు (69) కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్నాడు. ఈ క్రమంలో ఈనెల 24న తన ఇంట్లో పురుగుల మందు తాగాడు. చికిత్స నిమిత్తం అతన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి, మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోక్సో కేసు నిందితుడి రిమాండ్

కొండపాక(గజ్వేల్): పోక్సో కేసు నిందితుడిని కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ పేర్కొన్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన మైనర్‌పై లకుడారం గ్రామానికి చెందిన కంకణాల మల్లేశం అసభ్యకరంగా ప్రవర్తించినట్లు భరోసా కేంద్రంలో అమ్మాయి వాగ్మూలం మేరకు పోక్సో కేసు నమోదైంది. ఈ క్రమంలో మల్లేశంను అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చగా కోర్టు ఆదేశాల మేరకు చర్లపల్లి జైల్‌కు తరలించారు.

హత్యకేసులో వ్యక్తికి జీవిత ఖైదు

చిన్నశంకరంపేట(మెదక్): హత్యకేసులో ఓ వ్యక్తికి జీవితఖైదుతోపాటు జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది. జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస రావు వివరాల ప్రకారం... చిన్నశంకరంపేట మండలం సంగాయపల్లి గ్రామానికి చెందిన చెవ్వ ప్రవీణ్ పాతకక్షలతో అదే గ్రామానికి చెందిన లక్ష్మినారాయణపై పొలంలో దాడిచేసి తీవ్రంగా గాయపర్చాడు. అతన్ని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు అప్పట్లో కేసు నమోదు చేసిన రామాయంపేట సీఐ శ్రీధర్ విచారణ కొనసాగించారు. అలాగే ప్రస్తుత సీఐ వెంకట రాజాగౌడ్ సమగ్ర విచారణ నిర్వహించి సాక్ష్యాలను ప్రవేశ పెట్టారు. శుక్రవారం కేసు కోర్టులో విచారణకు రాగా పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ నిందితుడు ప్రవీణ్‌కు జీవితఖైదుతో పాటు రూ.5వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

సేవాతత్వమే లక్ష్యం కావాలి

రంగంపేట పీఠాధిపతి శ్రీమాధవానంద స్వామి సరస్వతి



కంగ్టిలో ప్రవచనం చేస్తున్న శ్రీమాధవానంద సరస్వతి స్వామి

కంగ్టి(నారాయణఖేడ్): సేవాతత్వమే మానవ జన్మ లక్ష్యం కావాలని శ్రీ మాధవానంద సరస్వతి స్వామి తెలిపారు. గురువారం రాత్రి మండల కేంద్రం కంగిలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నవరాత్రుల్లో ప్రతిష్ఠించిన దేవి విగ్రహానికి పూజ, హారతి నిర్వహించిన అనంతరం వేదికపై ప్రవచనం చేశారు. తోటి మానవునికి ఆపదలో ఆదుకోవడంలో ఉన్న సేవాతత్పరతనే భగవంతుని స్వరూపమని తెలిపారు. ఇతర ప్రాణులకు లేని సేవా గుణం మానవునికి భగవంతుడు కల్పించాడన్నారు. దానిని సద్వినియోగం చేసుకొని మానవజన్మను పరిపూర్ణం చేసుకోవాలని పిలుపునిచ్చారు. సక్రమ మార్గంలో సంపాదించిన డబ్బులతో సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో వినోద్ కుమార్, గణేశ్‌కుమార్, అక్షయ్‌జోషి, అశోక్ మహారాజ్, స్థానికులు పాల్గొన్నారు.

గునుగు, తంగేడు పూలు కరువు



బీడు భూముల్లో కనిపించని గుణక పువ్వు



తంగేడు పూలు కాయని మొక్కలు

శివ్వంపేట(నర్సాపూర్): బతుకమ్మలను పేర్చడానికి ముఖ్యంగా ఉపయోగించే గుణక (గునుగు పువ్వు), తంగేడు పువ్వులు ఈసారి దొరకని పరిస్థితి నెలకొంది. సహజ సిద్ధంగా లభించే ఈ రెండు పూలు కనిపించడం లేదు. సాగు విస్తీర్ణం పెరగడంతో పాటు అతివృష్టి మూలంగా బీడు పొలాల్లో గుణక, తంగేడు పెరగని పరిస్థితి నెలకొంది. సోమవారం నుండి గ్రామాల్లో సద్దుల బతుకమ్మ ఉత్సవాలు జరగనున్నాయి. బతుకమ్మలు పేర్చేటప్పుడు కీలకంగా వాడే గుణక, తంగేడు పూల కొరతతో ఇతర పూలతో ఉత్సవాలు నిర్వహించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

విష జ్వరాలు రాకుండా చూసుకోవాలి

అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్



ఓపీ రికార్డులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్

కొండపాక(గజ్వేల్): వరుస వర్షాల వల్ల గ్రామాల్లో విష జ్వరాలు రాకుండా చూడాలని అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ వైద్య సిబ్బందికి సూచించారు. కుకునూరుపల్లిలోని ప్రభుత్వ ఆస్పత్రిని శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. కాగా కొండపాకలోని ప్రభుత్వ ఆస్పత్రిని జిల్లా వైద్యాధికారి ధన్‌రాజ్ సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నెల రోజులుగా వరుసగా వర్షాలు అధికంగా కురుస్తున్నాయని, ప్రజలు వ్యాధుల బారిన పడకుండా అవగాహన కల్పించాలన్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టేంత వరకు వైద్య సిబ్బంది సెలవు పెట్టకూడదన్నారు. ముఖ్యంగా మలేరియా, డెంగీ వ్యాధులు ప్రబలకుండా ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ఇంటింటికీ తిరుగుతూ ప్రజలకు సలహాలు, సూచనలు చేయాలన్నారు. స్వస్త్ నారీ శక్తి పరివార్ పేరిట గ్రామాల్లో వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. విష జ్వరాలు ప్రబలితే వైద్య సిబ్బంది బాధ్యత వహించాల్సి వస్తుందంటూ హెచ్చరించారు. ఆస్పత్రిలో ఓపీ, మందుల స్టాక్, సిబ్బంది అటెండెన్స్ రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు శ్రీధర్, పర్విన్, ఏఎన్ఎం పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులను పస్తులుంచొద్దు

- వేతనాలు వెంటనే విడుదల చేయాలి
- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య

సిద్దిపేటరూరల్: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుతూ, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్న పంచాయతీ కార్మికులను పండుగ పూట పస్తులు ఉంచడమే ప్రజాపాలనా అని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ... మూడు నెలలుగా ప్రభుత్వం వేతనాలు విడుదల చేయకపోవడం వల్ల కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తక్షణమే పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని, దసరాకు రెండు జతల బట్టలు, సబ్బులు, నూనెలు అందించాలని డిమాండ్ చేశారు. డీపీఓ కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి వివరించగా సోమవారం లోపు వేతనాలు వస్తాయని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించి, డీపీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రవి కుమార్, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్, మహేశ్, జిల్లా నాయకులు బాల్ నర్సయ్య, జిల్లా కోశాధికారి కనకయ్య, నాయకులు రాజమౌళి, సురేందర్, యాదగిరి, సమ్మయ్య, కార్మికులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

కొనసాగుతున్న అంతర్రాష్ట్ర భజన పోటీలు



పోటీల్లో భజన చేస్తున్న మండలి సభ్యులు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని భవానీ మందిరంలో నిర్వహిస్తున్న అంతర్రాష్ట్ర భజన పోటీలు కొనసాగుతున్నాయి. ప్రతి ఏటా పెద్ద ఎత్తున ఈ పోటీలు నిర్వహిస్తుండగా తెలంగాణ, మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాల నుంచి భజన మండళ్లు పాల్గొంటున్నాయి. దేవి నవరాత్రి ఉత్సవ కమిటీ, భవానీ భజన మండలి ఆధ్వర్యంలో ఈ సంవత్సరం కూడా భజన పోటీలు జరుగుతున్నాయి. ప్రతి రోజు రాత్రి నాలుగు భజన మండలి టీంలు పోటీల్లో పాల్గొంటున్నాయి. ఈ పోటీలు ఈ నెల 28 వరకు కొనసాగుతుండగా విజేతలకు నగదు బహుమతులను అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. న్యాయ నిర్ణేతలుగా బెంగళూరుకు చెందిన సంగీత విద్వాంసులు చింతామణి విశ్వనాథం, జహీరాబాద్‌కు చెందిన శంకర్‌జోషి వ్యవహరిస్తున్నారు.

పూలను పూజించే పండుగ



విద్యుత్ శాఖ కార్యాలయంలో బతుకమ్మ సంబరాల్లో మహిళలు

మెదక్ కలెక్టరేట్: పూలను పూజించడం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయమని మెదక్ విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ నారాయణ నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం మెదక్ విద్యుత్‌శాఖ జిల్లా కార్యాలయం ఆవరణలో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఈ సంబురాలను ఎస్ఈ నారాయణ నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులు బతుకమ్మను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఈలు శ్రీనివాస్, చాంద్‌పాషా, ఏడీఈ, ఏఈలు నవీన్ పార్వతీ, సబ్ ఇంజినీర్లు వినీల, జీవన, ఆఫీస్ సిబ్బంది విజయలక్ష్మి, సంతోషి, జ్యోతి, యాదమ్మ, రామవ్వ, నాగమణి పాల్గొన్నారు.